అమ్మో.. విషజ్వరాలు..!

- శరీరంపై దద్దుర్లతో రోజుల తరబడి తగ్గని నీరసం
- జోన్ – 5 పరిధిలో 84 డెంగీ కేసుల నమోదు
- హైరిస్క్ ఏరియాగా పారిశ్రామిక ప్రాంతం గుర్తింపు
- యూపీహెచ్‌సీల్లో అరకొర వైద్యం
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



52వ వార్డులో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త



జ్వరాలపై సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

విశాఖ విద్య : సీజనల్ వ్యాధులు నగర వాసులను పట్టిపీడిస్తున్నాయి. విష జ్వరాలు విజృంభిస్తుండడంతో అనేక మంది ఆస్పత్రుల పాలవుతున్నారు. ప్రజానీకం వ్యాధుల బారిన పడకుండా జీవీఎంసీ వైద్య విభాగం అధికారులు నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమౌతుండడంతో రోగ పీడితుల సంఖ్య రోజురోజుకి పెరుగుతూనే ఉంది. అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నప్పటికీ తగిన వైద్యం అందకపోవడం, కేజీహెచ్‌కి వెళ్లినా అక్కడ పట్టించుకుంటారో..? లేదో..? అనే అనుమానంతో జ్వర పీడితులు ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. శరీరంపై దద్దుర్లు రావడం, నీరసం ఎక్కువ రోజులు ఉండడంతో అమ్మో ఇవేమి జ్వరాలు బాబోయ్ అని నగరవాసులు ఆందోళన చెందుతున్నారు.

డేంజర్ జోన్‌లో పారిశ్రామిక ప్రాంతం

విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని పారిశ్రామిక ప్రాంతంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. నియోజకవర్గంలోని మిగతా వార్డుల కంటే ఇక్కడ డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. నియోజకవర్గంలోని జోన్ – 5 పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 84 డెంగీ కేసులు నమోదయ్యాయి. అదే విధంగా జోన్ – 8లో 12 కేసులు నమోదయ్యాయి. గత ఏడాది కంటే కేసుల సంఖ్య తగ్గిందని జీవీఎంసీ వైద్య విభాగ అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి.

జీవీఎంసీ 42, 45, 54 వార్డుల్లో గతేడాది కంటే ఎక్కువ కేసులు నమోదు కావడం గమనార్హం. విశాఖ నగరంలోని 8 జోన్ల పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి జూలై నెలాఖరు వరకు ఏడు నెలల కాలంలో 243 డెంగీ కేసులు నమోదైతే... అందులో 74 కేసులు జోన్ – 5 లోనే ఉన్నాయి. ప్రస్తుత వర్షాలతో డ్రైనేజీల్లో మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెంది డెంగీ జ్వరాలు విజృంభిస్తాయని ఈ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీ

సాధారణ జ్వరంతో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లిన వారికి అక్కడి నిర్వాహకులు చుక్కలు చూపిస్తున్నారు. డెంగీ జ్వరం సోకిందని, ప్లేట్లెట్లు పడిపోయాయని లేనిపోని రక్త పరీక్షలు చేసి వేలాది రూపాయలు గుంజేస్తున్నారు. డెంగీ నిర్ధారణ అనేది ఎలీషా టెస్ట్ ద్వారా, కేజీహెచ్‌లో మాత్రమే నిర్ధారించాల్సి ఉంటుంది. కానీ నియోజకవర్గంలోని కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు, వాటికి అనుబంధంగా ఉన్న ల్యాబ్‌లలో ఎడాపెడా డెంగ్యూ పరీక్షలు చేసేస్తున్నారు. వీటిని నగర పాలక సంస్థ వైద్య విభాగపు అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

వైద్యులు, సిబ్బంది మధ్య సమన్వయం కరవు

నియోజకవర్గంలోని జోన్ – 5 పరిధిలో 23 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జోన్ – 8 పరిధిలో 10 ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా సచివాలయ ఏఎన్‌ఎంలు ఉన్నప్పటికీ నగరపాలక సంస్థ వైద్య విభాగపు అధికారులకు వీరితో ఏమాత్రం సమన్వయం లేకపోవడంతో వ్యాధుల నియంత్రణకు అడ్డుకట్ట పడటం లేదు. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా పనిచేస్తున్నారు. నియోజకవర్గంలో విస్తరిస్తున్న డెంగ్యూ జ్వరాలపై ఉన్నత స్థాయి పర్యవేక్షణ లేకపోవడంతో జ్వర పీడితులు వైద్యం కోసమని ప్రైవేటు ఆస్పత్రులనే ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్ట పోతున్నారు.



కరాసలో దోమల వృద్ధికి కారణమౌతున్న శుభ్రం చేయని డ్రైనేజీ

అప్రమత్తంగానే ఉన్నాం



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగానే ఉన్నాం. నివారణ చర్యల్లో భాగంగా డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దష్టి సారించాం. 65 మంది సీజనల్ సిబ్బందిని సైతం విధుల్లోకి తీసుకొని వార్డుల్లో నిత్యం తిరిగేలా ఆదేశాలిచ్చాం. వీరంతా నవంబర్ వరకు పనిచేస్తారు. గతంలో కంటే ప్రస్తుతం డెంగీ కేసులు తగ్గాయి. ప్రైవేట్ ఆస్పత్రిలో డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించకూడదు.

– డాక్టర్ సునీల్, వైద్యాధికారి, జోన్ – 5

ఫుట్‌పాత్ ఆక్రమణలపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

గోపాలపట్నం: ఫుట్‌పాత్‌లు, గ్రీన్ బెల్టులు ఆక్రమించి వ్యాపారాలు చేయకూడదని సచివాలయ ప్లానింగ్ సిబ్బంది పేర్కొన్నారు. ఈమేరకు ప్లకార్డులతో అవగాహన కల్పించారు. జీవీఎంసీ 92,91 వార్డుల పరిధి గోపాలపట్నం నుంచి బాజి జంక్షన్ వరకు బీఆర్‌టీస్ రహదారిలో ఫుట్‌పాత్ వ్యాపారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గించొద్దని సూచించారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపి రఘునాథ రెడ్డి, టీపీవో తేజేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో యాక్సెప్ట్ ప్రతినిధులు

గాజువాక: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు యాక్సెప్ట్ సంస్థ ప్రతినిధులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో యాక్సెప్ట్ ప్రోగ్రాం మేనేజర్ పద్మప్రియ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

గిడుగు సేవలు చిరస్మరణీయం



గిడుగు రామ్మూర్తిపంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

మల్కాపురం: తెలుగు భాషను వ్యవహారిక భాషగా తీర్చిదిద్దిన మహానుభావుడు మన గిడుగు రామ్మూర్తిపంతులు అని మల్కాపురం శాఖ గ్రంథాలయాధికారి అజయ్ అన్నారు. తెలుగు భాషాదినోత్సవాన్ని మల్కాపురం శాఖ గ్రంథాలయంలో నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి పాల్గొన్నారు.

ఎన్‌ఏడీలో నల్లరిబ్బన్లతో నిరసన



నల్ల రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న ఎన్ఏసీఈడబ్ల్యూ యూనియన్ సభ్యులు

గోపాలపట్నం: ఎన్ఏడీ సివిలియన్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యుల తీరుపై నేవల్ ఆర్మమెంట్ సివిలియన్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు గురువారం నల్ల రిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలపు మారయ్య మాట్లాడుతూ ఎన్ఏడీ సివిల్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీలో రుణాలు ఇవ్వకుండా సభ్యుల హక్కులను కాలరాస్తున్నార న్నారు. దీని వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోవలసి వస్తోందన్నారు. త్రిఫ్ట్ డిపాజిట్లు రూ.200 నుంచి రూ.500 వందలకు పెంచి భారం మోపారన్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో పూజలు



పూజలందుకుంటున్న సాయినాథుడు

మల్కాపురం : జీవీఎంసీ 60వ వార్డు గుల్లల పాలెం మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో గల సద్గురు షిర్డీసాయి బాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. స్థానికంగా నివసిస్తున్న నార్త్ ఇండియన్ మహిళలు బాబాకు క్షీరాభిషేకం, విభూదితో అభిషేకం చేశారు. హారతి పూజలు అనంతరం బాబాను పట్టు వస్త్రాలు, ఆభరణాలు, సుగంధ పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు.

విశాఖ విద్య : జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం బాబాకి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర శతనామార్చన పూజలు చేశారు. సాయంత్రం పంచహారతులు ఇచ్చారు. భక్తులంతా సామూహికంగా సాయి సంకీర్తన ఆలపించి, మంత్రపుష్పం జపించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్లా సత్యనారాయణ రావు, కోశాధికారి సుబ్బారావు ఏర్పాట్లు చేశారు.



మంత్రపుష్ప పూజలో భక్తులు

తెలుగుభాష తీయనైనది



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సూర్యనారాయణ తదితరులు

గోపాలపట్నం: తెలుగు భాషతీయనైనదని రచయిత, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ చిన సూర్యనారాయణ అన్నారు. గోపాలపట్నం ఆదిత్య కళాశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష ఎంతో మధురమైనదని ఇందులో ఏభాషలో లేని విధంగా ప్రక్రియలు, సోయగాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవాటుగా మార్చుకుంటే మనకు జీవితసారాన్ని నేర్పిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.మురళీ మోహన్ రావు తదితరులు మాట్లాడారు. అనంతరం బాల సాహిత్య పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త కేవీఎస్ నరసింహం, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మధుర డిప్యూటీ మేయర్‌తో జియ్యాని శ్రీధర్ భేటీ



మధుర ప్రతినిధులతో శ్రీధర్ కుటుంబ సభ్యులు

విశాఖ విద్య : విశాఖ నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మధుర జిల్లాలోని శ్రీ కృష్ణ భగవానుని దర్శనం చేసుకున్నారు. శ్రీ కృష్ణుడు చిన్నతనంలో పెరిగిన అనేక ప్రదేశాల్లో ఒకటైన మధుర బృందావనంను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బృందావన్ మధుర డిప్యూటీ మేయర్ ముఖేష్ సరస్వత్, మధుర నగర నిగమ్ కమిషనర్ అనూజ్ కౌషిక్ తదితరులు డిప్యూటీ మేయర్ శ్రీధర్ కుటుంబ సభ్యులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తమ నగరాల్లో నగరపాలక సంస్థ అమలు చేస్తున్న అంశాలపై చర్చించినట్లు శ్రీధర్ తెలిపారు.


పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి



కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

సీతంపేట: పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే ఇటీవల కాలంలో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు ఆరోపించారు. పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించాలని, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని, భద్రత పాటించని యాజమాన్యాలను కఠినంగా శిక్షించాలని కోరుతూ వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెంలో గల కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్‌వీ కుమార్, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఏఐఇఫ్టూ కార్యదర్శి గణేష్ పాండా మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామిక ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో ఐదుగురు కార్మికులు, అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మాకంపెనీలో రియాక్టర్ పేలి 17 మంది, పరవాడలోని సినర్జిన్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇవి ప్రమాదాలు కావని, యాజమాన్యం చేసిన హత్యలని ఆరోపించారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం తీసుకువచ్చిన 64 జీవోతో పరిశ్రమలలో తనిఖీలు చేయనవసరం లేదని, యాజమాన్యాలు సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే సరిపోతుందని తెలిపారు. అప్పటి నుంచి పరిశ్రమల్లో తనిఖీలు జరగడం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో పరిశ్రమలకు విచ్చలవిడిగా అనుమతులివ్వడం, చట్టాలను గాలికి వదిలేయడమే ప్రమాదాలకు దారితీస్తున్నాయన్నారు. అనంతరం కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.సుబ్బారావు, పి.వెంకటరావు, ప్రకాష్‌రావు, చంద్రశేఖర్, శివ, ఏఐటీయూసీ నాయకులు వామనమూర్తి, బి.వెంకటరావు, సత్యాంజనేయ, సత్యనారాయణ, కాసుబాబు, ఇఫ్టూ నాయకులు మల్లన్న, తిరుపతి రావు, వెంకటరావు పాల్గొన్నారు.

పేదలకు సేవతోనే సంతృప్తి



పేదలకు చీరలు, దుప్పట్లు, ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కంచరపాలెం : పేదలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని విజయ సాయి మెగా చారిటబుల్, కోన కుంచయ్య చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ప్రతినిధి జగదీశ్వరరావు పేర్కొన్నారు. జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్ తుమ్మడపాలెంలో విశాఖ జిల్లా యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు, గొల్ల కంచరపాలెం గ్రామ మాజీ అధ్యక్షుడు కోన కుంచయ్య మహాలక్ష్మమ్మ పేరిట గురువారం పేదలకు చీరలు, దుప్పట్లు ఆహార పొట్లాలు అప్పలరాజు, మురళీకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ కోన కుంచయ్య పేరిట 45 సంవత్సరాల నుంచి ట్రస్ట్ అనేక సేవ కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఇప్పటికే 110 మంది వృద్ధులు, అనాథలకు ఆశ్రయం కల్పించామన్నారు. అనంతరం సుమారు 120 మంది పేదలకు చీరలు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కాయిత పైడి రత్నాకర్, ధనలక్ష్మి, కృష్ణ కల్యాణి, కోన బాబు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యమాలే శరణ్యం

అగనంపూడి: విశాఖ ఉక్కును కాపాడుకోడానికి ఉద్యమాలే శరణ్యమని వీఎస్ఈయు నాయకుడు మహాలక్ష్మినాయుడు, పరిరక్షణ కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసనగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల సారథ్యంలో కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. ఈనెల 31న పదవీ విరమణ పొందనున్న ఏఐటీయు రాష్ట్ర అధ్యక్షుడు చిత్రాడ సన్యాసిరావును పోరాట కమిటీ నాయకులు ఘనంగా సత్కరించారు.

ధ్యాన మందిరంలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం : రైల్వే న్యూ కాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మెడికవర్, శ్రీ నేత్ర ఐ కేర్, శ్రీ వేంకటేశ్వర పుష్పగిరి కంటి హాస్పిటల్స్, సంధ్య డెంటల్ కేర్ హాస్పిటల్ సిబ్బంది ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 100 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. కొందరికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారని, ఉచితంగా ఆపరేషన్స్ చేసేందుకు ఆస్పత్రులు ముందుకొచ్చాయని ధ్యాన మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. ఇదే ప్రాంగణంలో సంధ్య డెంటల్ కేర్ సిబ్బంది 60 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమాల్లో డాక్టర్ జయసాయి చందు, డాక్టర్ కళ్యాణి, అభిరామ్, నీరజ, ప్రియాంక, డాక్టర్ రాజు, ప్రసాద్, డాక్టర్ రేష్మ, వై.శ్రీలత పాల్గొన్నారు.

ముగిసిన ఇంజినీరింగ్ షాప్స్ ఫైవ్ ఎస్ వారోత్సవాలు



అవార్డులు అందజేస్తున్న జీఎంలు మధుసూధనరావు, పాండే

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఇంజనీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగంలో ఫైవ్ ఎస్ (పని ప్రదేశ నిర్వహణ) వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. గురువారం విభాగం కాన్ఫరెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ వెల్ఫేర్ విభాగం జీఎం ఎం. మధుసూధనరావు ముఖ్య అతిథిగా హాజరై బెస్ట్ ఫైవ్ ఎస్ జోన్, బెస్ట్ కైజన్, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైవ్ ఎస్ అమలు చేయడం వల్ల పని ప్రదేశం సురక్షితంగా ఉండటంతో ఉత్పత్తి పెంపుదలకు దోహదపడుతుందన్నారు. విభాగాధిపతి, జీఎం ఎస్.కె. పాండే మాట్లాడుతూ వారోత్సవాల్లో చేసిన కార్యక్రమాలను వివరించారు. మెకానికల్ ఇన్‌చార్జ్ ఎన్.వీరేశం ఉత్సవ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఫైవ్ ఎస్ కో–ఆర్డినేటర్ పి. విద్యాసాగర్, అధికారులు బి.ఆర్. జెనా, కృష్ణప్రసాద్, కె. శ్రీనివాసరావు, నాయక్, ఎం. రాజశేఖర్, సిహెచ్. శ్రీనివాస శాస్త్రి, సిహెచ్. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఉక్కు టౌన్ అడ్మిన్ వద్ద ధర్నా చేస్తున్న శ్రామిక సంఘం నాయకులు, కార్యకర్తలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఉక్కు శ్రామిక సంఘం యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఉక్కు శ్రామిక సంఘం ఆధ్వర్యంలో టౌన్ అడ్మినిస్ట్రేషన్ విభాగం వద్ద జరిగిన కార్యక్రమంలో నిర్వాసిత కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం చేస్తే సహించబోమన్నారు. విభాగంలో టెండర్ పూర్తి చేసి 14 నెలలు పూర్తయిందని, వెంటనే అందులో పనిచేసిన 34 మందికి ఫుల్ అండ్ ఫైనల్ వెంటనే చెల్లించాలన్నారు. ఆరేళ్ల క్రితం టెండర్ పూర్తయిన అందులో పని చేసే 180 మంది కార్మికులకు ఇంత వరకు ఫుల్ అండ్ ఫైనల్ చెల్లించలేదన్నారు. అనంతరం విభాగాధిపతి చంద్రశేఖర్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి బొడ్డు పైడిరాజు, కరణం సత్యారావు, వేణురెడ్డి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా సేవా మార్గాలు



ఆర్‌కేపురం వద్ద గల సేవా మార్గంలో నిలిచిన బురద నీరు



శ్రీహరిపురం వద్ద సేవా మార్గంలో కురుస్తున్న వర్షం

మల్కాపురం : తెరిపివ్వకుండా కురుస్తున్న వర్షంతో పారిశ్రామిక ప్రాంతంలో సేవా మార్గాలు తడిసి ముద్దయ్యాయి. వర్షం నీరు సేవా మార్గంలో నిలిచిపోవడంతో బురదమయమయ్యాయి. కొన్నిచోట్ల చెట్లు నేలకొరిగాయి. బుధవారం రాత్రి ఉరుములు మెరుపులతో ప్రారంభమైన భారీ వర్షం గురువారం సాయంత్రం వరకూ కొనసాగింది. వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు. తెరిపివ్వకుండా కురిసిన వర్షంతో కొండ చరియలు విరిగిపడతాయేమోనని కొండవాలు ప్రాంత ప్రజలు భయాందోళన చెందారు.

వాల్తేర్ డివిజన్ నుంచి 220 పోస్టుల సరెండర్ దారుణం

శ్రామిక్ యూనియన్ డివిజనల్ కో ఆర్డినేటర్ రామమోహన్‌రావు



డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ నుంచి 220 పోస్టులను సరెండర్ చేస్తూ ఈస్ట్ కోస్ట్ రైల్వే యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని శ్రామిక్ యూనియన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని డివిజినల్ కో ఆర్డినేటర్ పి.రామమోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు ఆయన నేతృత్వంలో ప్రతినిధి బృందం డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనేక విభాగాల్లో సుమారు 5 వేల ఖాళీలున్నాయని, తీవ్రమైన మానవ వనరుల కొరతతో రైల్వే కార్మికులు పని ఒత్తిడి ఎదుర్కొంటున్నారని, ఇటువంటి ప్రతికూల పరిస్థితుల్లో సైతం వాల్తేర్ డివిజన్‌ను దేశంలో అగ్రగామిగా నిలుపుతున్నామని ఆయన తెలిపారు. ఈ సమయంలో ఉన్న పోస్టుల్లో 220 శాశ్వతంగా ఖుర్దారోడ్, సంబల్‌పూర్ డివిజన్‌కు సరెండర్ చేయడం అన్యాయమన్నారు. ఈ ప్రక్రియను ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ఇది కూడా అశాస్త్రీయ పద్ధతిలో చేపట్టారని ఆరోపించారు. ఇటువంటి ఏకపక్ష నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని, తక్షణమే ఉత్తర్వులు రద్దు చేయాలని కోరారు. వాల్తేర్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డీఆర్‌ఎంను కోరారు. ఉత్తర్వులు ఉపసంహరించుకోకుంటే కార్మికులతో కలిసి పోరాడుతామన్నారు. ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ జోనల్ కార్యదర్శి బి.దామోదరరావు, ఎన్.ధనరాజు, బి.చక్రవర్తి తదితరులు డీఆర్‌ఎంను కలిశారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అచ్యుతరావు

పెదగంట్యాడ: విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఒప్పందనాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఐ గాజువాక శాఖ కార్యదర్శి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కెంగువ అచ్యుతారావు డిమాండ్ చేశారు. స్థానిక పోతిన సన్యాసిరావు భవన్‌లో మీటర్ రీడర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని అంగీకరించబోమని ప్రకటించిందని, ఇప్పుడు ఎలా ఒప్పందం చేసుకుంటారని ప్రశ్నించారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కానీ జిల్లాలో ఇప్పటికే స్మార్ట్ మీటర్లను డంప్ చేశారన్నారు. మీటర్ల రీడర్లు చాలీచాలని జీతాలతో సతమవుతున్నారని, స్మార్ట్ మీటర్ల వల్ల వారి పరిస్థితి మరింత దయనీయంగా మారే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేసి మీటర్ రీడర్లను ఆదుకోవాలని కోరారు.